
# సన్మానం

-వియోగి



వాసుకు ఒక కోరిక ఉండిపోయింది తీరకుండా.

ఇంత బ్రతుకు బ్రతికి తనకు ఒక్క పౌర సన్మానం కూడ జరగలేదని. వాసు బాగా బ్రతికాడు- మంచి కంపెనీలో ఓ మోస్తరు ఉద్యోగంచేసి వాలంటరీ రిటైర్‌మెంటు తీసుకున్నాడు కొంచెం అనారోగ్య కారణాలవలన.

అతని పిల్లాడు అమెరికాలో బాగా సంపాదిస్తున్నాడు రెండు చేతుల్తో.

"నాన్నా! ఆ ముష్టి ఉద్యోగం వదిలెయ్యి- మహాఅయితే పదివేలు యిస్తారు అంతేగా- నీకెంత కావాలంటే అంత పంపిస్తా- రిజైన్ చెయ్యి." అంటూ ఫోనులో అదరగొడితే- గమ్మున ఆ పని చేసేశాడు.

వాసు కొడుకు దాసు మాట నిలబెట్టుకుని నెల నెల కొంత పంపుతూ ఉంటాడు. పని పాట ఏమీలేకపోవడం వలన పేపరు చదవడం, మిత్రులతో కాలక్షేపం చేయడం అలవాటయింది.

పేపర్లల్లో ఫలానా వారికి సన్మానం జరిగిందని రాస్తూ ఉంటే కన్నార్పకుండా చదువుతూ ఉంటాడు వాసు.

ఏదో మొక్కుబడిగా అతను రిజైన్ చేసిన సందర్భంలో ఓ దండ అతని మెడలో పడింది. దాన్ని ఆయన సన్మానంగా భావించలేదు చచ్చిన శవానికి కూడ దండలు పడతాయి గదా!

సన్మానం అంటే వందల మంది ప్రజల మధ్య వేదికపైన జరగాలి- విలేఖరులు హాజరు కావాలి - టీవీ ఛానెల్సు వాళ్ళు కవరు చెయ్యాలి. తనకు దుశ్శాలువా కప్పాలి - మెడనిండా దండలు వేయాలి! చప్పట్లతో హాలు మారుమ్రోగిపోవాలి.

వచ్చిన చిక్కల్లా ఎక్కడ వచ్చిందంటే వాసుకు సన్మానం అందుకునే అర్హత కనపడ్డం లేదు. అతను గొప్ప రచయిత కాని- కవి కాని కాడు. పోనీ రాజకీయ నాయకుడు కూడా కాదు. గొప్ప వక్త కూడా కాదు- ప్రజాసేవ కళాంకితుడు- అంటే ప్రజాసేవకు అంకితమైన వాడు కాదు- మరి యింక సన్మానాలు ఎలా జరుగుతాయి. ఎవరు ఆయన్ని పొగుడుతారు? ఎవరికేం పట్టింది ఆయనకు సన్మానం చేయడానికి?

తనతోపాటు పార్కులో కూర్చునే రిటైర్డు ఎంప్లాయీస్‌తో ఇదే విషయం అడిగితే వాళ్ళు "దాందేముంది! మాకు పదివేలు డొనేషన్ యివ్వు- ఓ ఆడిటోరియంలో గొప్ప సన్మానం చేస్తాం" అని సెలవిచ్చారు.

కాని అతగాడికి వారిపైన నమ్మకం లేదు. రాలిపోయే పువ్వులు- వాళ్ళేం మాట్లాడుతారు తన గురించి?

వాళ్ళు మాట్లాడినా ఎవరు పత్రికల్లో వార్తలు వేస్తారు! అందుకని మర్యాదగా తిరస్కరించాడు.

"అలా కాదు నన్ను గుర్తించి ఈ సంఘం నన్ను సన్మానించాలి."

వాళ్ళు ఎగతాళిగా నవ్వారు- పగలబడి నవ్వారు.

"నువ్వేమన్నా సచిన్ టెండూల్కర్ అనుకుంటున్నావా? సానియా మీర్జా అనుకొంటున్నావా? ఆ కాలం పోయింది- ఇప్పుడు హోటల్సు ఎక్కడున్నాయి- అన్నీ టిఫెను సెంటర్లే- సెల్ఫ్‌సర్వీసు టిఫెను సెంటర్లు- ఎవరి టిఫెను వాళ్ళు తెచ్చుకుని తిన్నట్లు- ఎవరి సన్మానం వాళ్ళు చేసుకోవాలి. కాకపోతే డబ్బులన్ని నువ్వే యిస్తావు- దండలు- శాలువలు వేరే వాళ్ళతో వేయించుకుని కప్పించుకుంటావు- ఊరికే పిచ్చి పిచ్చి కలలు కనవాకు. ఆరోగ్యం చెడిపోతుంది." అని ఒక వయో వృద్ధుడు హెచ్చరించాడు కూడ.

జ్ఞానులు ఎవరైనా మంచిమాటలు చెబితే విని అర్థం చేసుకుంటారు- పాటిస్తారు. కాని మూర్ఖులకు ఇతరుల మాటలు రుచించవు- అర్థంకావు వ్యర్థం!

ఆ చందాన వాసుకు వారి మాటలు బుర్రకెక్కలేదు- కాగా అగ్నికి ఆజ్యం తోడైనట్లు వారి హేళన అతనిలో సన్మానం చేయించుకోవాలని మరింత పట్టుదల పెంచింది.

ఓసారి గాంధీ గార్ని ఆదర్శంగా తీసుకుని ఓ రోజు ఉదయం తన వీధి ఊడవటం మొదలెట్టాడు- మరీ ఆకులు అలములతో చెత్తగా ఉందని. ఆ వీధి వాళ్ళంతా వింతగా చూశారు. అప్పుడు తనే చెప్పాడు.

"మీరంతా స్వార్థపరులు మీ గుమ్మంముందు ఊడ్చుకుంటారు. ఆ ఊడ్చిన మీ చెత్తను- మీ పక్కింటికో- రోడ్డు మధ్యకో నెట్టేస్తారు. నేను అలా కాదు- వీధిని శుభ్రం చేస్తాను" అంటూ వీరఫోజులిచ్చాడు ఆడాళ్ళ ముందు.

ఇలా రెండురోజులు చేశాడో లేదో ఓ పది మంది మున్సిపల్ స్వీపర్లు కట్టకట్టుకుని వచ్చేశారు అతనింటికి.

వాసు సంతోషపడ్డాడు సన్మానం చేయడానికొచ్చారనుకుని.

"ఏందిబే! మా ఉద్యోగాలు ఊడగొట్టడానికి చూస్తున్నావా?" పొద్దున్నే ఫుల్ లోడులో ఉన్నట్లున్నాడు ఒకడు మీదిమీదికి వచ్చాడు.

"దూరం- దూరం నేనేం చేశాను- నేనెవరిపైనా కంప్లెయింటు కూడ యివ్వలేదు." బిత్తరపోయి అన్నాడు వాసు.

"నువ్వేమన్నా పెద్ద హీరోననుకున్నావా మా పని నువ్వు చెయ్యడానికి- మేం కాస్త స్ట్రైకులో వుంటే నువ్వు మా పని చేస్తావు- నిన్ను ఖతం చేస్తాం!"అంటూ ఇంకోడు ఆవేశపడిపోయాడు.

"నాకేం తెలీదు- కాస్త సంఘసేవ చేద్దామని ఊడ్చాను- అంతే!"

"అరె చుప్ బేకూఫ్! నిన్ను చూసి అందరూ చీపుళ్ళు పట్టుకొని ఊడిస్తే మా ఉద్యోగాలు ఎలా ఉంటాయి? మా స్ట్రైకు ఎలా సక్సెస్ అవుతుంది." ఇంకోడు రెచ్చిపోయాడు.

మూర్ఖపు ప్రజలు మహాత్ములని ఏనాడు ఆదరించారు కనుక- అని జాలిపడ్డాడు వాళ్ళను చూసి.

ఓ అరగంట తిట్లు తిన్న తర్వాత ఇక అటువంటి పనులు మళ్ళీ చేయనని ఒప్పుకున్నాడు.

"బాబూ! నాకు బుద్ధివచ్చింది. వీధి ఊడ్చటం కాదు- మా యిల్లు కూడ నేను ఊడ్చుకోను." అని చెప్పి చెంపలేసుకున్నాడు.

పోతూ పోతూ మందు కొట్టడానికి ఓ అయిదొందలు వసూలు చేసుకుని పోయారు. ఇవ్వక తప్పింది కాదు. వీధి ప్రజలంతా వాసూనే చూస్తున్నారు మరి.

వాసు భార్య బాల ఈ చోద్యమంతా చూసి వాళ్ళు వెళ్ళింతర్వాత బాగా క్లాసు తీసుకుంది. "పనీపాట లేని మంగలి పిల్లి తల గొరిగాడని- 'కృష్ణారామ' అనుకుంటూ కూర్చోకుండా- అవ్వ- వీధులు ఊడ్చడమేంటి- పరువు పోగొట్టుకోవడమేంటి- ఐదొందలు వదిలించుకోవడమేంటి- ఛీ ఛీ! ఇలా అయితే నే పుట్టింటికి పోతాను- జాగ్రత్త!" వార్నింగు యిచ్చింది. అసలే ఆమె హైక్లాసు లేడీ- మహిళా మండలిలో సేవా కార్యక్రమాలు చాలా చేస్తూ ఉంటుంది.

ఓ గురువారం వంట వాళ్ళను పిలిపించి రెండు గుండిగలు అన్నం సాంబారు వండించి, స్వీట్లు- పండ్లు కొని- స్వయంగా వాటిని తీసుకుపోయి అక్కడ ఆడుకుంటున్న ముష్టివాళ్ళకు- భక్తులకు పందేరం చేయించి ఇంటికొచ్చి గుండెలమీద చెయ్యి వేసుకుని పడుకున్నాడు- ఈ జీవితం ధన్యమైపోయిందని భావిస్తూ కాస్త కునుకు తీశాడు.

ఇంతలోనే లారీ ఆగిన చప్పుడయింది. జనం దాంలోంచి దిగడం మొదలెట్టారు.

"వీళ్ళ దుంపతెగ! వీళ్ళకి సన్మానం ఎక్కడ, ఎప్పుడు, ఎలా చేయాలో తెలీదులాగుంది. నేరుగా యింటికి రావడమే! బాల చూస్తే ఏమనుకుంటుంది- అలగా జనంతో సన్మానం చేయించుకున్నాననుకోదూ." అంటూ విసుక్కుంటూ బయటకొచ్చాడు.

ఎవ్వరి చేతుల్లోనూ దండలయితే లేవుగాని- కొందరి చేతుల్లో కర్రలున్నాయి.

"ఇందాక సాయిబాబా గుడి వద్ద అన్నదానం చేసింది నువ్వేనా?" ఓ పెద్దమనిషి చాలా మర్యాదగా అడిగాడు.

"ఆ! నేనే! కాని నాకు పబ్లిసిటీ యిచ్చుకోవడం యిష్టం ఉండదు- అందుకే బ్యానర్లు కట్టలేదు. ఎక్కడా నా పేరు రాయలేదు-" చెప్పాడు వినయంగా తల వంచి.

"కడుపుకేం తింటున్నావు?" ఇంకోళ్ళు కరుగ్గా అడిగారు.

"నేను మీ లాంటి మామూలు మనిషినే! కూర, పప్పు, సాంబారు, అన్నం తింటూ వుంటాను- నేనేం దేవతని కాను- నన్ను అలా చెయొద్దు". ఇంకా వినయంగా చెప్పాడు వాసు- తన గురించి చాలా గొప్పగా ఊహించుకుంటూ.

"ఇందాక నువ్వు పంచి పెట్టినవి తిన్నావా?" ఇంకెవరో అడిగారు.

"అబ్బే! నాకు మిగిలితేగా- ఇంటికొచ్చి భోంచేశాను" చెప్పాడు.

"కనుక బ్రతికిపోయావు- నీ పుణ్యమాని వందల మంది హాస్పిటల్లో చావుబ్రతుకుల్లో ఉన్నారు- తెల్సా!" పెద్దమనిషి అడిగాడు.

"నాకేం అర్థంకావడంలేదు-" అయోమయంలో పడిపోయాడు.

"హాస్పిటల్‌కు రా తెలుస్తుంది- ఇప్పుడు వాళ్ళకు మందులెవరు కొనిస్తారు? డాక్టరు ఫీజులు ఎవరు భరిస్తారు?"

"సార్! మా వాళ్ళని బ్రతికించండి- మీ కాలు మొక్కుతాం." అంటూ కొందరు స్త్రీలు అతనిమీద పడ్డారు.

పరిస్థితి అర్థమై వాళ్ళెంబడి హాస్పిటల్‌కు పోయాడు- అక్కడ చాలామంది ఎమర్జెన్సీ వార్డులో అడ్మిట్ అయి ట్రీట్‌మెంటు తీసుకుంటున్నారు. కొందరు ఓపీలో ట్రీట్‌మెంటు తీసుకుంటున్నారు. చాలామంది ప్రైవేట్ హాస్పిటల్‌కు వెళ్ళారుట.

వాసు పోగానే డాక్టరు పెద్ద లిస్టు రాసిచ్చాడు-మందుల లిస్టు- గ్లూకోజ్ బాటిళ్ళు- సెలైన్ బాటిళ్ళు- డజన్లకొద్దీ ఇంజెక్షన్లు- వందల కొద్దీ సిరంజీలు- ఇవన్నీ అర్జెంటుగా కొనుక్కురమ్మన్నాడు- అతను ఏదో చెప్పబోతే ఎవరూ అతనికి ఆ అవకాశం యివ్వలేదు. దాదాపు తోసుకుంటూ అతన్ని మెడికల్ షాపు దగ్గరికి లాక్కెళ్ళారు. షాపువాడు అవన్నీ చూసి చెప్పాడు. "పదివేలు దాటుతుంది. సార్ అన్నీ ఒకేసారి కావాలా! కొంచెం కొంచెం తీసుకుంటారా?"

"అన్నీ ఇవ్వవయ్యా! అవతల ప్రాణాలు పోతున్నాయి." అతని వెంబడి వచ్చిన వాళ్ళు చెప్పారు.

"నేనేం డబ్బు తీసుకరాలేదు!" ఏడుపుమొహం పెట్టి చెప్పాడు వాసు.

"ఫర్వాలేదు సార్ - రేపు యివ్వండి- మీరెక్కడికి పోతారు షాపు ఎక్కడికి పోతుంది." చెప్పాడు షాపువాడు అన్నీ పెట్టెల్లో ప్యాక్ చేస్తూ.

లక్కీగా అందరూ కోలుకున్నారు- కాని రెండురోజులు అతనికి అదే డ్యూటీ- ఆసుపత్రికి పోవడం- పరామర్శించడం- మందులు కొనివ్వడం- డాక్టర్ల చేతులు - నర్సుల చేతులు తడపడం.

ఇంత చేసిందానికి అందరూ తనను దేముడిలా చూస్తారనుకుంటే- ఒక నేరస్థుడ్ని చూసినట్లు- పెద్ద హంతకుడ్ని చూసినట్లు చూశారు. హతోస్మి!

ఒక రోజు విరిగిన హృదయంతో తుంగభద్ర నది ఒడ్డున నడుస్తూంటే అతన్ని ఓ జంట ఆకర్షించింది. ఒక మొగ- ఒక ఆడ- ఒకళ్ళపైన ఒకళ్ళు పడి ఏడుస్తున్నారు- మధ్యమధ్యలో ముద్దు పెట్టుకుంటున్నారు- కన్నీళ్ళు తుడుచుకుంటున్నారు- వారిది ముదురు ప్రేమలాగుంది. సీనియరు ప్రేమికుల్లాగున్నారు. అతనికి అక్కడక్కడ జుత్తు నెరిసింది- ఆమెకు ముప్పయి దాటి ఉండవచ్చు. ఆమె చాలా అందంగా ఉంది. ఖరీదైన దుస్తుల్లో మెడలో నగల్తో అతను సఫారీ డ్రస్సులో చాలా స్మార్టుగా ఉన్నాడు. అతను మధ్య వయస్కుడు లాగున్నాడు.

పెద్దలు వారి ప్రేమకు అంగీకరించినట్లు లేదు- ఆత్మహత్య చేసుకుందామని వచ్చినట్లున్నారు- బహుశ ఏట్లో మునిగే ముందు మనసు విప్పి మాట్లాడుకుందామనుకునుంటారు- అని అనిపించింది వాసుకు.

అతనిలోని సేవాతత్పరం వెల్లివిరిసింది. ఆవేశంతో ముందుకు దూకాడు.

"మీరేం చావాల్సిన పని లేదు." వాళ్ళ ముందుకు వచ్చి చెప్పాడు వాసు.

ఇతన్ని చూసి వాళ్ళు కంగారు పడిపోయి సర్దుకు కూర్చున్నారు.

"మీ ఇద్దరికీ యింకా పెళ్ళికాలేదు కదూ!" అడిగాడు.

వాళ్ళు తలలు ఆడించారు అడ్డదిడ్డంగా.

"మీ పెళ్ళికి మీ వాళ్ళు అంగీకరించలేదు కదూ!" అడిగాడు మళ్ళీ ఈసారీ తలకాయలు ఆడించారు.

"అంత మాత్రాన చనిపోవాలా? మనిషికి కేవలం జీవించే హక్కు ఉంది కాని- చనిపోయే హక్కు లేదు-" కఠినంగా అన్నాడు వాసు.

"నువ్వు గాని పోలీసు గాని కాదు కదా?" అడిగాడు మొగతను కంగారు పడుతూ.

"ఖచ్చితంగా కాదు- మీలాంటి ఓ భగ్న ప్రేమికుడ్ని పెద్దల మూర్ఖత్వానికి నా ప్రేమను బలి యివ్వాల్సి వచ్చింది. మీరు అలా కాకూడదు. నాకు అప్పట్లో ఎవరు అండగా నిలబడలేదు- కాని ఇప్పుడు నేను మీకు అండగా వుంటాను- మీ ఇద్దరికి వివాహం నేను జరిపిస్తాను." ఉపన్యాసం దంచాడు వాసు.

"ఎప్పుడు? అడిగాడు మొగతను."

"నీ పేరేంటి!"

"రాజు!" చెప్పాడు. "ఈమె పేరు రాణి!"

"ఊ! పేర్లు కూడ కలిశాయన్నమాట- అయితే కులం కలవలేదనుకుంటా- అమర ప్రేమకు అవన్నీ అడ్డురావు- రేపు దయం పది గంటలకు సాయిబాబా గుడిలో మీకు వైభవంగా పెళ్ళి జరిపిస్తాను- నేరుగా మీ యిద్దరూ అక్కడికి వచ్చేయండి- ఈలోగా మీరేం పిచ్చిపన్లు చేయద్దు- జీవితం అమూల్యమైంది."అంటూ హితబోధ చేశాడు.

వాళ్ళిద్దరూ ఆనందంగా విన్నారు- చీకటి పడటంతో వాళ్ళను అక్కడ వదిలిపెట్టి వచ్చేశాడు- మరునాటి కార్యక్రమంకు ఏర్పాట్లుచేయాలి కాబట్టి.

ఆ రాత్రి అతి కష్టంమీద నిద్రపోయాడు- జీవితంలో తను చేస్తున్న ఒక మంచి పని. ఒక ఉచిత వివాహం.

స్వంత కొడుకులకు, కూతుళ్ళకు పెళ్ళిచేయకుండా వదిలేస్తున్న కాలంలో - ముక్కుమొహం తెలియని ప్రేమికులను తను జంటగా చేయబోతున్నాడు.

వాసు 'హౌగ్రేట్ యూ ఆర్!'అని తన్నుతాను అభినందించుకున్నాడు.

భార్యామణి బాలను ఆ వివాహానికి ముఖ్యఅతిథిగా ఆహ్వానించాడు- ఎంతైనా భార్యకదా- తన కీర్తిప్రతిష్టలలో ఆమెకూ కొంచెం వాటా యిద్దామని.

"ఛీ ఛీ! అనాథ పెళ్ళిళ్ళకు- అనాథ ప్రేత సంస్కారాలకు నేను రాలేను. నాకు అర్జెంటు పన్లు చాలా ఉన్నాయి."అని తిరస్కరించి వెళ్ళిపోయింది.

అనుకున్న టైంకు అనుకున్నట్లుగా అందరూ సమావేశమయ్యారు. జర్నలిస్టులను- ఫొటోగ్రాఫర్లను- టీవీ ఛానెళ్ళ వాళ్ళను డబ్బులిచ్చి మరీ పిలిపించాడు.

'మాంగల్యం తంతునామే' అంటూ మంగళ సూత్రధారణ అయిపోయింది. పేపరోళ్ళు ఘనంగా ఆ కార్యక్రమాన్ని వీక్షించారు. ఇతను మంచి స్టార్ హోటల్లో భోజనాలు ఏర్పాటుచేశాడు అందరికీ- అంతకుముందు జరిగిన అన్నదాన కార్యక్రమం మనసులో మెదులుతూ ఉండటంతో ఈసారి అటువంటి పొరపాట్లు జరగకూడదని.

నూతన వధూవరులకు మంచి ఏసీ డీలక్సు రూము బుక్ చేశాడు, హోటల్లో.

**"వీళ్ళ దుంపతెగ! వీళ్ళకి సన్మానం ఎక్కడ, ఎప్పుడు, ఎలా చేయాలో తెలీదులాగుంది. నేరుగా యింటికి రావడమే! బాల చూస్తే ఏమనుకుంటుంది- అలగా జనంతో సన్మానం చేయించుకున్నాననుకోదూ."**

'డోంట్ డిస్టర్బ్! న్యూ లీ మేరీడు' అను బోర్డు పెట్టించాడు. వాళ్ళిద్దరూ ఇతని కాళ్ళకు మొక్కారు.

'దీర్ఘ సుమంగళీ భవ!'అని ఆమెను- 'దీర్ఘాయుష్మాన్ భవ!' అంటూ అతడిని దీవించాడు.

మరునాడు పొద్దున్నే పోయి బజారులో కనిపించిన పేపర్లన్నీ కొనుక్కొన్నాడు.

అన్నింట్లో పెళ్ళి ఫొటోలు- వార్తలు వేశారు.

ఇతని దాతృత్వాన్ని పొగుడుతూ చాలా పత్రికలు రాశాయి. ఇతన్ని సమాజం ఆదర్శంగా తీసుకోవాలంటూ ఆకాశానికి ఎత్తేశాయి.

ఈసారి ఖచ్చితంగా తనకు సన్మానాలు జరుగుతాయని- అదృష్టం కల్సి వస్తే 'సంఘశ్రీ' అనో 'సేవారత్న'అనో బిరుదులు వస్తాయనుకున్నాడు.

నూతన జంటను పలకరిద్దామని ఉదయం పదికి తయారై బయటకు రాబోయాడు. ఈలోగా ఓ జీపు వచ్చి ఆగింది... దాంలోంచి యస్సై- ఇద్దరు పోలీసు కానిస్టేబుళ్ళు- ఇంకా నలుగురు అపరిచిత వ్యక్తులు దిగారు.

'అరె! ప్రభుత్వం ఇంత తొందరగా తనకు అవార్డు ప్రకటిస్తుందా?' అని ఆశ్చర్యపోయాడు. ఎంతైనా హైటెక్కు ప్రభుత్వంగదా ఏం జరిగినా ఆశ్చర్యంలేదు.

"రండి! రండి! కూర్చోండి పేపర్లో చూసినట్లున్నారు-" నవ్వుతూ ఆహ్వానించాడు.

"సారీ! మేం కూర్చోడానికి రాలేదు- డ్యూటీలో వచ్చాం-" యస్సై.

"ఇద్దరుగాని లేండి- ఓ నిమిషం కూర్చుంటే కనీసం మీకు కూల్ డ్రింక్సన్నా తెప్పిస్తాను" సిగ్గుపడిపోతూ చెప్పాడు- వాళ్ళేదో మూమెంటో యివ్వబోతున్నట్లు ఊహించుకుంటూ.

"చేసిన వెధవ పని చాలక మమ్మల్ని కూల్‌డ్రింక్‌తో ఐస్ చేద్దామనుకుంటున్నావా రాస్కెల్!" ఓ గళ్ళ లుంగీ అతను అరిచాడు.

"మా అమ్మాయిని కిడ్నాప్ చేసి- ఎవడికో యిచ్చి పెళ్ళిచేస్తావు- నీ అంతు చూస్తాం!" ఇంకో పెద్దమనిషి కళ్ళు ఎర్రచేశాడు.

"నా పెళ్ళాంకు మళ్ళీ పెళ్ళిచేయడానికి నీకెంత ధైర్యంరా?" ఓ కుర్రాడు చేతులు మడిచాడు.

వాసుకు జరుగుతున్నదేంటో అర్థం కావడంలేదు.

"యు ఆర్ అండర్ అరెస్టు మిష్టర్ వాసు. నీ మీద కిడ్నాపు- నగల దొంగతనం నేరాలు రిజిష్టరు చేయబడ్డాయి." యస్సై చెప్పాడు.

"బాలా! ఏమిటీ గోల!"అంటూ కుప్పకూలిపోయాడు వాసు.

హడావిడికి బాల పరుగెత్తుకుంటూ వచ్చి యస్సైని ఆరాతీసింది ఇదీ విషయంట.

రాణికి ఇదివరకే పెళ్ళయింది. అనంతపురంలో కాపురం. పదేళ్ళ బాబున్నాడు- మళ్ళీ ఈమధ్య పాపకు జన్మయిచ్చింది - డెలివరీ కష్టమయి ఆమెకు కొంచెం మతిస్థిమితం తప్పింది. వారం రోజులుగా ఆమె కనపడ్డం లేదు- పోలీసులు కేసు కూడ రిజిష్టరు చేసుకున్నారు. కడపలో రాజు ఓ పేషెంటుట! హాస్పిటల్ నుంచి పారిపోయి వచ్చాట్ట. అతనికి ఇదివరకు పెళ్ళయింది- భార్య బిడ్డలున్నారు. కాని హెచ్.ఐ.వి. పాజిటివ్ రావడంతో ఇంట్లోంచి పారిపోయి వచ్చి కర్నూలు హాస్పిటల్లో అడ్మిట్ అయ్యాడు. అక్కడ నుంచి కూడ పారిపోయాడట. (మిగతా 27వ పేజీలో)


# సైన్స్ టిప్

-సి.వి.సర్వేశ్వర శర్మ

## రక్తం ఎర్రగా ఎందుకు ఉంటుంది?

రక్తం చూడనివారు ఉండరు. ఎవరి శరీరం నుండి రక్తం బయటకు వచ్చినా ఎర్రగానే ఉంటుంది. రక్తం ఎర్రగా ఉండడానికి కారణం రక్తంలో ఉండే ఎర్ర రక్త కణాలు. ఇవి సమతలంగా ఉండే డిస్క్‌లుగా ఉంటాయి. ఇవి చాలా ముఖ్యమైన పనిని నిర్వహిస్తాయి.

ఎర్ర రక్త కణాలు శరీరంలోని కణాలకు ఆక్సిజన్‌ను మోసుకుపోతాయి. వాటి నుండి తయారైన కార్బన్ డై ఆక్సైడ్‌ను తమ కూడా తీసుకుపోతాయి. ఒక మైక్రో లీటర్ రక్తంలో నాల్గు నుండి ఆరు మిలియన్ల ఎర్ర రక్త కణాలు ఉంటాయి.




మనిషి రక్తంలో ప్లాస్మా అనే ద్రవ పదార్థం ఉంటుంది. ప్లాస్మా లేత పసుపురంగులో ఉంటుంది. నీటికన్నా చిక్కగా ఉంటుంది. ప్లాస్మాలో అనేక పదార్థాలు కరిగి ఉండడంవల్ల దానికి చిక్కదనం వస్తుంది.

రక్తంలో ఎర్ర రక్తకణాలు, తెల్ల రక్తకణాలు కూడా ఉంటాయి. ఆక్సిజన్‌ను మోసుకుపోయే ప్రోటీన్, హిమోగ్లోబిన్. దీని కారణంగానే ఎర్ర రక్త కణాలకు ఎరుపురంగు వస్తుంది. అందుకే రక్తం ఎర్రగా ఉంటుంది.

సాధారణంగా శరీరంలో ప్రవహించే రక్తం గడ్డకట్టదు. అయితే కొంతమందికి రక్తనాళాల్లో రక్తం గడ్డకట్టిన సందర్భాలు కన్పిస్తూనే ఉంటాయి. గాయం ఏర్పడినపుడు రక్తం గడ్డకట్టాలి. అలా గడ్డకట్టకపోతే శరీరం రక్తాన్ని నష్టపోతుంది.

గాయం శరీరంలోపల అయినా, బయట అయినా రక్తం గడ్డకడుతుంది. శరీరానికి గాయం అయినపుడు రక్తనాళం తెగడం, నలగడంవల్ల రక్తం వెలుపలకు వస్తూ దెబ్బతిన్న కణాన్ని తాకుతుంది. ఈ దెబ్బతిన్న కణం రక్తంలోకి రెండు పదార్థాలను విడుదల చేస్తుంది. ఈ రెండు పదార్థాలు 'త్రాంబిన్' అనే ప్రోటీన్ ఎంజైమ్‌ను తయారుచేస్తాయి.

ఈ త్రాంబిన్ రక్తంలోని 'ఫిబ్రినోజిన్'తో చర్యకు దిగి 'ఫ్రిబిన్'ను ఏర్పరుస్తుంది. ఈ ఫిబ్రిన్ అణువులు దారాల్లా తయారై దెబ్బతిన్న రక్తనాళానికి మెష్ మాదిరి వలగా ఏర్పడి గాయంమీద అతుక్కుపోతుంది.

రక్తంలోని రక్తకణాలు, ప్లేట్‌లెట్స్, ప్లాస్మాలు ఈ మెష్‌లు ఇరుక్కుపోయి గడ్డ కడుతాయి. రక్తం గాయంనుండి కారకుండా ఇది గాయానికి బిరడా వలె పని చేస్తుంది.

రక్తం గాయం నుండి కారడం వెంటనే తగ్గించేందుకు లేదా రక్తం గాయంవద్ద గడ్డకట్టే చర్యను వేగవంతం చేసేందుకు కొన్ని రసాయనాలు ఉపయోగిస్తారు. వీటిలో చెప్పుకోవలసినవి లోహపు అయాన్లు.

పటిక అంటే అల్యూమినియం, పొటాషియం సల్ఫేటుల ఒక సంశ్లిష్ట లవణం. పటికలో ఉన్న పొటాషియం రక్తం గడ్డకట్టే పనిని తొందర చేస్తుంది. అందువల్ల రక్తం వెంటనే గడ్డకట్టి రక్తం గాయం నుండి కారకుండా నిరోధించగల్గుతుంది.

పటిక రక్తనాళాల నుండి రక్తస్రావాన్ని నిరోధించగల ఒక గొప్ప నిరోధకం. ఇది రక్త నాళాన్ని దగ్గరకు నొక్కుతుంది. దానివల్ల రక్తస్రావం ఆగిపోతుంది. రక్త నాళం తెగినపుడు దానివద్ద పటిక అద్దితే తెగిన నాళం మూసుకుపోతుంది. అందుకే రక్తస్రావం వెంటనే ఆగిపోతుంది. ★

**రక్తంలో ఎర్ర రక్తకణాలు, తెల్ల రక్తకణాలు కూడా ఉంటాయి. ఆక్సిజన్‌ను మోసుకుపోయే ప్రోటీన్, హిమోగ్లోబిన్. దీని కారణంగానే ఎర్ర రక్త కణాలకు ఎరుపురంగు వస్తుంది. అందుకే రక్తం ఎర్రగా ఉంటుంది.**

---

*(9వ పేజీ తరువాయి)*

వీళ్ళిద్దరికోసం పోలీసులు గాలిస్తున్నారు. అనంతపురంలో, కడపలో విడివిడిగా, రాజు ఆమెను చూసి, వెంటబడి కర్నూలు తీసుకువచ్చాడుట.

ఒక రోజు మంత్రాలయంలో రాజుకు రాణితో పరిచయమైందిట! ఆమె అమాయకత్వం- ఆమె నగలు రాజును బాగా ఆకర్షించాయిట. వాళ్ళ ఊరుకు తీసుకపోతానని చెప్పి కర్నూలులో దింపి మాయమాటలు చెప్పాడట- వాళ్ళ వాళ్ళను పిలిపిస్తున్నానని. కర్నూలు పోలీసులకు దొరికినట్లు దొరికి తప్పించుకు పోయాట్ట రాజు ఆమెను తీసుకొని.

ఈలోగా మన సంఘసేవ పిసాసకుడు వాసు వారికి వివాహం జరిపించాడు- శాస్త్రోక్తంగా.

పేపర్లో ఫొటోలు వార్తలు చూసి అందరూ పరుగెత్తుకుంటూ వచ్చారు అటు అనంతపురం నుండి- ఇటు కడప నుండి- కర్నూలు పోలీసుస్టేషనుకు. అప్పుడు పోలీసులు విజృంభించారు.

జీపులో వాసును కూర్చోపెట్టుకుని లాడ్జికి తీసుకువచ్చారు అప్పటికి రాణి పిచ్చి చూపులు చూస్తూ బోసి మెడతో ఒంటరిగా ఉంది.

ఉదయాన పోయిన రాజు తిరిగి రాలేదు.

ఆమె నగలు ఏవీ లేవు ఒంటి మీద.

వాసును స్టేషన్‌కు తీసుకుపోయి యస్సై వాయించేశాడు.

"మహాప్రభో నాకే పాపం తెలీదు"అంటూ లబోదిబో ఏడ్చాడు.

రాణి వాళ్ళాయన వాసును పిచ్చకొట్టుడు కొట్టాడు స్టేషనులో.

"నాకెటువంటి దురుద్దేశం లేదు- వాళ్ళు తలలాడిస్తేనే నేను పెండ్లి చేసింది- బలవంతాన చేయలేదు- వాళ్ళు యిటువంటి వాళ్ళని తెలిస్తే నేను వాళ్ళ జోలికి పోయేవాడిని కాను-" అంటూ కాళ్ళు పట్టుకున్నాడు.

"నన్ను నమ్మండి- నన్ను వదిలి పెట్టండి"అంటూ ప్రాధేయపడ్డాడు.

"మీరు అన్ని విషయాలు కోర్టులో చెప్పండి!"అని యస్సై తిరస్కరించాడు.

బాల నానా తిప్పలు పడి- యమ్మెల్యేను కల్సి అంతా వివరించి అతని ద్వారా డిఐజికి ఫోన్ చేయించింది- వాసును వదలమని.

ఓ లాయరును తీసుకుని స్టేషనుకు వచ్చింది.

అతి కష్టంమీద బెయిలుపైన విడుదలయ్యాడు వాసు. బెయిలు యిచ్చిన పెద్దమనిషి ఓ కండీషను పెట్టాడు.

"ఇక మీదట సంఘ సేవా కార్యక్రమాల జోలికి పోకూడదు" అని.

"ఇంత ఘన సన్మానం జరిగింతర్వాత ఇంక మామూలు సన్మానాలకోసం ఎందుకు దేవులాడుతాను- బ్రతికి వున్నంత కాలం ఈ సేవల జోలికి పోను- నన్ను వదిలి పెడితే అంతే చాలు!" అని ఒట్టుపెట్టుకున్నాడు వాసు.

★